క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను ఆహ్వానించిన మున్సిపల్ చైర్‌పర్సన్



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, నాగరాజు

ప్రొద్దుటూరు : ఈనెల 16న జరగనున్న తమ కుమారుడి వివాహానికి హాజరు కావాలని ప్రొద్దుటూరు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఆమె భర్త నాగరాజు బుధవారం తాడేపల్లిలోని కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఆహ్వానించారు. వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరారు.

ఉత్సాహంగా క్రీడా ఎంపికలు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బుధవారం మండల స్థాయి ఎస్‌జీఎఫ్ అండర్ 14, 17 బాల బాలికలకు వాలీబాల్, చెస్, యోగా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ పోటీల్లో మండలంలోని పలు ప్రాంతాలకు చెందిన 500 మంది విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. పాల్గొన్న క్రీడాకారులకు గణిత ఉపాధ్యాయుడు శివప్రతాప్‌రెడ్డి భోజన వసతి కల్పించారు. మండల స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను డివిజన్ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలను ఎంఈఓ–2 శోభారాణి, ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్ కుమార్, ఎస్‌జీఎఫ్ మండల కోఆర్డినేటర్ షేక్ బాబు, పీడీ షేక్ అల్లాబకాష్, ఎస్ఎంసీ చైర్మన్ బాలరాజు, రాయలసీమ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు తదితరులు పర్యవేక్షించారు.

ఎస్ఈసీ మెంబర్‌కు సన్మానం



రాజగోపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బద్వేలు అర్బన్ : వైఎస్సార్‌సీపీ స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ (ఎస్ఈసీ) సభ్యుడిగా నియమితుడైన మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డిని బుధవారం నెల్లూరురోడ్డులోని ఆయన వ్యక్తిగత కార్యాలయంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి ఆధ్వర్యంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలిసికట్టుగా పనిచేసి కూటమి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు సమష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ కాశినాయన మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, ఏరియా కన్వీనర్ చెన్నకృష్ణారెడ్డి, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, రమణారెడ్డి పాల్గొన్నారు.

వెంకటరమణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటు

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన మండల మాజీ ఉపాధ్యక్షుడు సిద్దు బాలసుబ్బారెడ్డి కుమారుడైన సిద్దు వెంకటరమణారెడ్డి మృతి పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ సంతాపం ప్రకటించారు. విద్యుత్‌షాక్‌కు గురై మృతి చెందిన వెంకటరమణారెడ్డి అంత్యక్రియలకు బుధవారం ఆమె హాజరై నివాళులర్పించారు. వెంకటరమణారెడ్డి కుటుంబానికి పార్టీ అండగా ఉండి అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

చాపాడు : ఈనెల 7న మైదుకూరులో జరిగిన ఎస్‌జీఎఫ్ఐ జిల్లా స్థాయి అండర్–19 పోటీలలో మండలంలోని అయ్యవారిపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డి తెలిపారు. హామర్‌త్రోలో ఎస్.సమీరా ప్రథమ స్థానం, ఏఎల్ నరసింహులు ద్వితీయ స్థానంలో నిలిచి త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు గోపీనాథ్, ఉపాధ్యాయులు అభినందించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారులు

పోరుమామిళ్ల : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు జిల్లా జట్టును బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపిక చేశారు. ఉమ్మడి కడప జిల్లా నుంచి 100 మంది బాల బాలికలు పాల్గొన్నారు. పోటీలను ప్రిన్సిపాల్ రామిరెడ్డి ప్రారంభించారు. సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, టెన్నికాయిట్ పోటీలకు జట్ల ఎంపిక జరిగింది. పోటీలను వ్యాయామ ఉపాధ్యాయులు నాగేశ్వరరెడ్డి, విజయప్రసాదరెడ్డి, సుబ్బరాజు, స్కూల్ గేమ్స్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి పర్యవేక్షించారు.

చెరువు స్థలాన్ని కాపాడాలి

బద్వేలు అర్బన్ : ఆక్రమణకు గురైన బయనపల్లె చెరువు స్థలాన్ని కాపాడాలని బుధవారం సీపీఐ ఎంఎల్ లిబరేషన్ ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓకు వినతిపత్రం అందజేశారు. ఆ పార్టీ జిల్లా స్టాండింగ్ కమిటీ సభ్యుడు ఎస్.చంద్రశేఖర్ మాట్లాడుతూ చెన్నంపల్లె గ్రామ పొలం సర్వే నంబర్ 1567/1ఎ రెవెన్యూ రికార్డుల్లో చెరువు, రస్తాగా ఉన్న స్థలాన్ని కొంత మంది రెవెన్యూ అధికారుల సహాయంతో ఆన్‌లైన్ చేయించుకున్నారని తెలిపారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు జకరయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్



బద్వేలు రూరల్ నాయకులతో కలిసి డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ



గోపవరం: పి.పి.కుంటలో డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ

ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 16 నెలల కాలంలో రెడ్‌బుక్ రాజ్యాంగంతో అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్తకు అండగా ఉండేందుకే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్ తీసుకువచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. స్థానిక ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే కార్యాలయంలో బద్వేలు రూరల్ నాయకులతో కలిసి బుధవారం డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులను, కార్యకర్తలను, సోషల్ మీడియా యాక్టివిస్టులను, మీడియా ప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి వేధించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. టీడీపీ రెడ్‌బుక్ అరాచకాల బారిన పడిన ప్రతి ఒక్కరికి వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ అండగా ఉంటుందని, అలాగే అరాచకాలకు పాల్పడిన టీడీపీ నేతలు, అందుకు సహకరించిన అధికారులు తప్పనిసరిగా చట్టం ముందు నిలబడాల్సి వస్తుందన్నారు. ఈ బుక్‌లో రెడ్‌బుక్ అరాచకాల బారిన పడిన బాధితుల వివరాలు, జరిగిన నష్టాలను పొందుపరిచేందుకు వీలుంటుందని, అన్యాయానికి గురైన ప్రతి కార్యకర్త డివిజల్ బుక్‌ను వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోకల మల్లేశ్వర్‌రెడ్డి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బోడపాటి రామసుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి పెద్దపోలిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, ఆయా పంచాయతీల నాయకులు కృష్ణారెడ్డి, చంద్రఓబుల్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, యల్లారెడ్డి, రామసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారం శాశ్వతం కాదు

గోపవరం : అధికారం శాశ్వతం కాదని, ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తుంచుకోవాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండలంలోని పి.పి. కుంటలో బుధవారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు చల్లా రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ ప్రవేశపెట్టిన డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్ పోస్టర్లను ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 17 నెలల కాలవ్యవధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు వేధింపులకు గురి చేసిందన్నారు. ఇది ఎంతోకాలం కొనసాగదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమంపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ నాయకులను టార్గెట్ చేసి వారిపై అక్రమ కేసులు బనాయించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ బూత్ కన్వీనర్ల సమన్వయకర్త కె.రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, జగన్, శివారెడ్డి, సాంబశివారెడ్డి, పుల్లయ్య, సుందర్‌రామిరెడ్డి, మురళి, వెంకటేష్, తిరుపాల్, యల్లారెడ్డి, సర్పంచ్ నాగేంద్ర, రమణారెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో సమన్యాయం పాటించావా?



మాట్లాడుతున్న ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్

ప్రొద్దుటూరు రూరల్ : కొత్తపల్లె గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నా.. అని చెబుతున్న సర్పంచ్ శివచంద్రారెడ్డి మైదుకూరు రోడ్డు విస్తరణలో సమన్యాయం పాటించాడా అని ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ ప్రశ్నించారు. ఎంపీడీఓ కార్యాలయంలో తన ఛాంబర్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మైదుకూరు రోడ్డు విస్తరణను సర్పంచ్ తన సొంత లాభం కోసమే పనులు చేపట్టారన్నారు. ఈ విస్తరణలో తనకో న్యాయం, ప్రజలకో న్యాయమా అని విమర్శించారు. శివచంద్రారెడ్డి రూములకు అధికారులు మార్కింగ్ ఇచ్చినప్పటికీ ఆ రూములను కూల్చకుండా ప్రజల ఆస్తులను కూల్చేసి అన్యాయానికి పాల్పడ్డారని విమర్శించారు. అభివృద్ధి పనుల్లో శివచంద్రారెడ్డికి విజన్ లేకపోవడం ఒక సమస్య అయితే, డబ్బు మీద మమకారం పంచాయతీ ప్రజలకు శాపంగా మారిందన్నారు. మత్స్య కాలనీలో వార్డు మెంబర్ ఎన్నికపై శివచంద్రారెడ్డి కుమారుడిని పోటీకి దింపితే తమ నాయకుడు రాచమల్లు శివప్రసాదరెడ్డి ఒక సామాన్య కార్యకర్తను పోటీలో పెట్టారన్నారు. తన కొడుకు గెలుపునకు కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలను కూడగట్టుకుని కేవలం 40 ఓట్ల మెజారిటీతో గెలవడం ఒక గెలుపేనా అని ఎద్దేవా చేశారు. గతంలో రాచమల్లు శివప్రసాదరెడ్డి రామేశ్వరంలో రాచమల్లు రమాదేవితోపాటు మరో ఇద్దరు సామాన్య కార్యకర్తలను కౌన్సిలర్ బరిలో స్వతంత్ర అభ్యర్థులుగా నిలిపి అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. సోములవారిపల్లె గ్రామ పంచాయతీలో ప్రభుత్వ భూముల్లో తాను వెంచర్లు వేసిన విషయాన్ని నిరూపిస్తావా అని సవాల్ విసిరారు.

అడ్డంకుల తొలగింపుతో తగ్గిన నీటి ప్రవాహం



అలుగు వంకలో ప్రవహిస్తున్న నీరు

మైదుకూరు : పట్టణంలోని బద్వేలు రోడ్డులో అలుగు వంకకు ఉన్న అడ్డంకులను బుధవారం అధికారులు తొలగించడంతో స్థానిక పొట్టి శ్రీరాములు కూడలిలో వర్షపు నీటి ప్రవాహం తగ్గిపోయింది. సోమవారం కురిసిన భారీ వర్షంతో అలుగు వంకలో నీటి పరిమాణం పెరిగి అడ్డంకుల వల్ల బద్వేలు రోడ్డులోని పొట్టి శ్రీరాములు కూడలి ప్రాంతంలో జాతీయ రహదారిపై రెండు రోజులపాటు వర్షపు నీరు ప్రవహించిన విషయం తెలిసిందే. అధికారుల తీరుపై ఆరోపణలు రావడంతో బుధవారం జేసీబీ ఉపయోగించి అలుగు వంక నీటి ప్రవాహానికి అడ్డంకులుగా ఉన్న సిమెంట్ కట్టడాలను తొలగించారు. అలుగు వంక దిగువకు, డ్రైనేజీల్లోకి నీరు సక్రమంగా పారడంతో ప్రవాహం పూర్తిగా తగ్గిపోయింది.

దుకాణాలు తొలగించారు.. నిర్మాణం మరిచారు



నాడు ఇలా వ్యాపారాలు కొనసాగించేవారు



నేడు ఖాళీగా ఉన్న స్థలం

బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి మఠం ఆధీనంలో ఉన్న 36 వ్యాపార సముదాయాలను తొలగించి నెలలు గడుస్తున్నా తిరిగి నిర్మాణాలు చేపట్టక పోవడంతో చిరువ్యాపారులు రోడ్డున పడ్డారు. స్వామి గుడికి దక్షిణ భాగంలో ఉన్న పాత సత్రాలలో గత కొన్ని ఏళ్లుగా స్థానికులు భక్తులకు సంబంధించిన బొమ్మలు, ఇతర వ్యాపారాలు చేసుకుంటున్నారు. దేవస్థానానికి పరిపాలనా వ్యవహారం కోసం అప్పటి ఎండోమెంట్ ఏసీ శంకర్‌బాలాజీని బి.మఠం ఫిట్‌పర్సన్‌గా బాధ్యతలు అప్పగించారు. ఆయన బాధ్యతలు తీసుకున్న మూడేళ్లలో దాదాపు బ్రహ్మంగారిమఠం దేవస్థానం ఆవరణంలో రూ.10 కోట్ల నిధుల ద్వారా పలు అభివృద్ధి పనులు చేయించారు. ఈ పనుల వ్యవహారంపై దివంగత మఠాధిపతి రెండవ భార్య మారుతీ మహాలక్షుమ్మ దేవదాయ అధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారులు సరిగా స్పందించలేదని ఫిట్‌పర్సన్ వ్యవహారంపై హైకోర్టును ఆశ్రయించారు. కాగా అభివృద్ధికి గత ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే ఎస్. రఘురామిరెడ్డి పూర్తిగా సహకరించారు. అలాగే ప్రస్తుత ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ కూడా అభివృద్ధిపై ఇప్పటికే పలుమార్లు ప్రణాళికలు సిద్ధం చేయించారు. ఇందులో భాగంగా పాత సత్రాలలో వివిధ రకాల వ్యాపారాలు చేసుకుంటున్న 36 మంది వ్యాపారులను ఒప్పించి పాత సత్రాలను తొలగించారు. వాటి స్థానంలో కొత్తగా వ్యాపార సముదాయాలను ఏర్పాటు చేయించి ఇస్తామని తెలిపారు. తొలగించిన నెలకు నిర్మాణాల కోసం మార్కింగ్ ఇచ్చే లోపు మారుతీ మహాలక్షుమ్మకు అనుకూలంగా హైకోర్టు తీర్పు రావడంతో దేవదాయ కమిషనర్ శంకర్ బాలాజీని మఠం విధుల నుంచి తొలగించారు. దేవదాయ కమిషనర్ ఫిట్‌పర్సన్‌గా బాధ్యతలు తీసుకున్నారు. మఠం మేనేజర్ ఈశ్వరాచారికి నిర్వహణ బాధ్యతలు అప్పజెప్పారు. తొలగించిన వాటి స్థానంలో ఇంతవరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో చిరువ్యాపారులు రోడ్డున పడ్డారు. తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

చెకుముకి సైన్స్ సంబరాలను విజయవంతం చేయండి

కాశినాయన : ఈనెల 18వ తేదీ నుంచి జరిగే పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టును విజయవంతం చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి ఖాసీంవలి కోరారు.

బుధవారం నరసాపురం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చెకుముకి సైన్స్ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఖాసీం వలి మాట్లాడుతూ 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈ పరీక్ష రాసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ ఆచారి, ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

మధ్యంతర భృతి చెల్లించాలి



ఉపాధ్యాయులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న శ్యాంసుందర్ రెడ్డి

రాజుపాళెం : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లకు సంబంధించి కరువు భత్యం, 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా మండలంలోని తొండలదిన్నె, రాజుపాళెం గ్రామాల్లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లోని ఉపాధ్యాయులను బుధవారం సభ్యత్వం చేయించి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024 జనవరి నుంచి 2025 జులై వరకు పెన్షనర్లకునాలుగు విడదల కరువు భత్యం ప్రకటించాల్సి ఉందన్నారు. జులై నుంచి 12వ పీఆర్సీ అమలులోకి రావాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కమిషన్‌ను కూడా నియమించలేదన్నారు. దాదాపు 30 వేల కోట్ల రూపాయల బకాయిలు ఉన్నాయని, బిల్లులు ట్రెజరీలకు సమర్పించి మూడేళ్లు కావస్తున్నా ఇంతవరకు చెల్లించలేదన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస రెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరసింహ కుమార్, రామ దస్తగిరి రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు రాజశేఖర్ రెడ్డి, రమణా రెడ్డి, దస్తగిరి రెడ్డి పాల్గొన్నారు.

12న గడియారం వేంకట శేషశాస్త్రి విగ్రహావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని మున్సిపల్ పార్కులో ఈనెల 12న ఆదివారం ఉదయం 10 గంటలకు బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ గడియారం వేంకటశేష శాస్త్రి విగ్రహాన్ని ఆవిష్కరించనున్నట్లు శివభారతి విద్యాపీఠం కార్యదర్శి గడియారం వేంకట శేష శర్మ తెలిపారు. గడియారం వేంకట శేష శాస్త్రి రచించిన 'శ్రీ శివభారతం' మహాకావ్యం 1943లో నవీన ఆంధ్ర పంచ కావ్యాలలో ఒకటిగా గుర్తింపు పొందిందన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనమండలి సభ్యునిగా రెండు పర్యాయాలు (1959–1968) వరకు సేవలు అందించారని తెలిపారు.

1948లో మద్రాసు ప్రభుత్వం దశాబ్ద కాలపు ఉత్తమ సాహితీ గ్రంథంగా శ్రీ శివభారతాన్ని గుర్తించి ప్రథమ బహుమతి అందించి గడియారం వారిని సత్కరించారన్నారు.

1967లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సాహిత్య అకాడమి అవార్డు, 1976లో శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ఆయనకు ప్రదానం చేశారని వివరించారు. గడియారం విగ్రహాన్ని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆవిష్కరిస్తారని, శివభారతి విద్యాపీఠం అధ్యక్షుడు గడియారం నాగేశ్వర శర్మ, ప్రధాన వక్తగా అన్నదాత సుబ్రహ్మణ్య శర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తదితరులు హాజరవుతారని తెలిపారు.

అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన



అద్దె బస్సుల డ్రైవర్లతో మాట్లాడుతున్న అర్బన్ సీఐ రమణారెడ్డి, డిపో మేనేజర్ శ్రీలత



బస్సుల కోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు

మైదుకూరు : ఓ డ్రైవర్‌పై ప్రయాణికుడు దాడి చేసి తీవ్రంగా గాయపరచడంపై బుధవారం మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో అద్దె బస్సుల డ్రైవర్లు ఆందోళన చేశారు. దాడికి నిరసనగా విధులను బహిష్కరించారు. బస్టాండ్‌లో అద్దె బస్సులు నిలిపేశారు. కేవలం ఆర్టీసీ సొంత బస్సులు మాత్రమే నడిచాయి. బస్సులు సకాలంలో అందక మైదుకూరు బస్టాండ్‌లో ప్రయాణికులు తీవ్రంగా అవస్థలు పడ్డారు. అద్దె బస్సుల డ్రైవర్ల ఆందోళన గురించి తెలియకపోవడంతో ప్రయాణాలు పెట్టుకున్న వారు బస్సులు దొరకక బస్టాండ్‌లో చిక్కుకుపోయారు. ఎప్పుడో ఒక ఆర్టీసీ బస్సు రావడంతో దానిని ఎక్కేందుకు ప్రయాణికులు ఎగబడ్డారు.

మమ్మల్ని చులకనగా చూస్తున్నారు..

ఆందోళన చేస్తున్న డ్రైవర్లతో అర్బన్ సీఐ కె.రమణారెడ్డి, మైదుకూరు డిపో మేనేజర్ శ్రీలత మాట్లాడారు. డ్రైవర్‌పై దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేశారని సీఐ డ్రైవర్లతో అన్నారు. దాడిపై నిరసన వ్యక్తం చేయవచ్చని విధులు బహిష్కరించి ప్రయాణికులకు ఇబ్బంది కలిగించకూడదన్నారు. ఆందోళన విరమించి విధులకు హాజరు కావాలని సూచించారు. దానిపై అద్దె బస్సుల డ్రైవర్లు స్పందిస్తూ ప్రయాణికులు తమను చులకనగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పరిమితికి మించి ప్రయాణికులతో ఉన్నా తామున్న చోట బస్సును ఆపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారన్నారు. బస్సు ఆపకపోతే బస్సును ఆపి తమను కిందకు లాగి దుర్భాషలాడుతూ దాడులు చేసి కొడుతున్నారని వాపోయారు. ఒక ఊరికి ఒక స్టేజీ కాకుండా వారు కోరిన చోట ఆపమంటున్నారన్నారు. ప్రయాణికులకు కండక్టర్లు కూడా సపోర్ట్ చేస్తున్నారని ఆరోపించారు. ఒక ఊరికి ఒక స్టేజీ పెట్టాలని ప్రయాణికులు ఫిర్యాదు చేస్తే వెంటనే డ్రైవర్లను పక్కన పెట్టకుండా జరిగిన సంఘటనపై విచారణ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆ మేరకు డిపో మేనేజర్ శ్రీలతకు వినతి పత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు విధుల్లో చేరబోమని అద్దె బస్సుల డ్రైవర్లు స్పష్టం చేశారు.

ప్రొద్దుటూరు : స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద అద్దె బస్సుల డ్రైవర్లు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ మైదుకూరు – ఆళ్లగడ్డ మధ్య తిరుగుతున్న అద్దె బస్సు డ్రైవర్‌పై ప్రయాణికుడు దాడి చేయడం దుర్మార్గమైన చర్య అని, వెంటనే అతన్ని అరెస్టు చేయాలన్నారు. అద్దె బస్సు డ్రైవర్లకు ఆర్టీసీ బస్సు డ్రైవర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, ఉచిత ప్రయాణం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో డ్రైవర్లు డేనియల్, శివ, శ్రీను, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉపాధి పనులపై ప్రజావేదిక

ప్రొద్దుటూరు రూరల్ : మండలంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉపాధి పనులపై ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సూర్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31 వరకు జరిగిన ఉపాధి హామీ పథకం పనులపై 19వ విడత సామాజిక తనిఖీ నిర్వహించామన్నారు. ఈ సామాజిక తనిఖీలో వెలుగుచూసిన అంశాలపై ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి

చాపాడు : రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని దానికి అనుగుణంగా ఎరువులను వాడాలని జిల్లా వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. విజయలక్ష్మి పేర్కొన్నారు. మండలంలోని మడూరు, ఖాదరపల్లె గ్రామాల్లో బుధవారం వ్యవసాయ అధికారి దేవిపద్మలత భూసార పరీక్షల పత్రాలను రైతులకు పంపిణీ చేశారు.

14న వేలం పాట

చాపాడు : మండలంలోని అల్లాడుపల్లె వీరభద్ర దేవస్థానం సన్నిధిలో ఈనెల 14న తలనీలాల సేకరణ, టెంకాయల అంగడి నిర్వహణకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ శంకర్ బాలాజీ తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుతో పలువురికి లబ్ధి



మైదుకూరు : మాట్లాడుతున్న జీఎస్టీ అధికారి చక్రానాయక్

మైదుకూరు : జీఎస్టీ తగ్గింపుతో దేశంలో పలు వర్గాలకు లబ్ధి చేకూరిందని ప్రొద్దుటూరు జీఎస్టీ విభాగం డిప్యూటీ కమిషనర్ చక్రానాయక్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జీఎస్టీ తగ్గింపుపై విద్యార్థులకు వక్తృత్వ, పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ కళాశాలలో..

స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ రంగస్వామి మాట్లాడుతూ డిజిటల్ లెర్నింగ్ టూల్స్, క్రీడా పరికరాలు, దుస్తులు, పాద రక్షలు, ఆట బొమ్మలు, స్టేషనరీపై జీఎస్టీ తగ్గింపు వల్ల విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీ సుబ్బారావు, మున్సిపల్ మేనేజర్ పరమేశ్వరరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు బుధవారం జీఎస్టీ 2.0 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం చేపట్టిన జీఎస్టీ 2.0 పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో ఉపయోగమని ప్రిన్సిపాల్ రామిరెడ్డి చెప్పారు.